# గలతీయులకు వ్రాసిన పత్రిక 2వ అధ్యాయము

## యెరూషలేములో పౌలు సేవ ఒప్పుకొనబడెను

ఆటుపిమ్మట పదునాలుగు సంవత్సరములైన తరువాత నేను తీతును వెంటబెట్టుకొని బర్నబాతోకూడ యెరూషలేమునకు తిరిగి వెళ్లితిని. 2 దేవదర్శన ప్రకారమే వెళ్లితిని. మరియు నా ప్రయాస వ్యర్థమవునేమో లేక వ్యర్థమైపోయినదేమో అని నేను అన్యజనులలో ప్రకటించుచున్న సువార్తను వారికిని ప్రత్యేకముగా ఎన్నికైన వారికిని విశదపరచితిని. 3 అయినను నాతోకూడనున్న తీతు గ్రీసు దేశస్థుడైనను అతడు సున్నతి పొందుటకు బలవంతపెట్టబడలేదు. 4 మనలను దాసులుగా చేసికొన వలెనని క్రీస్తుయేసువలన మనకు కలిగిన మన స్వాతంత్ర్యమును వేగుచూచుటకు, రహస్యముగా తేబడిన దొంగతనముగా ప్రవేశించిన కపట సహోదరులవలన జరిగినది. 5 సువార్త సత్యము మీ మధ్య నిలుచునట్లు మేము వారికి ఒక్క గడియయైనను లోబడుటకు ఒప్పుకొనలేదు. 6 ఎన్నికైన వారుగా ఎంచబడిన వారియొద్ద నేనేమియు నేర్చుకొనలేదు వారెంతటివారైనను నాకు లక్ష్యము లేదు, దేవుడు నరుని వేషము చూడడు. ఆ ఎన్నికైనవారు నాకేమియు ఉపదేశింపలేదు. 7 అయితే సున్నతి పొందినవారికి బోధించుటకై సువార్త పేతురుకేలాగు అప్పగింపబడెనో, ఆలాగు సున్నతి పొందనివారికి బోధించుటకై నా కప్పగింపబడెనని వారు చూచినప్పుడు, 8 అనగా సున్నతి పొందినవారికి అపొస్తులుడవుటకు పేతురునకు సామర్థ్యము కలుగజేసినవాడే అన్యజనులకు అపొస్తులుడనవుటకు నాకును సామర్థ్యము కలుగజేసెనని వారు గ్రహించినప్పుడు, 9 స్తంభములుగా ఎంచబడిన యాకోబు కేఫా యోహాను అను వారు నాకు అనుగ్రహింపబడిన కృపను కనుగొని, మేము అన్యజనులకును తాము సున్నతిపొందిన వారికిని అపొస్తలులుగా ఉండవలెనని చెప్పి, తమతో పాలివార మనుటకు సూచనగా నాకును బర్నబాకును కుడిచేతిని ఇచ్చిరి. 10 మేము బీదలను జ్ఞాపకము చేసికొనవలెనని మాత్రమే వారు కోరిరి ఆలాగు చేయుటకు నేనును ఆసక్తి కలిగియుంటిని.

## పౌలు పేతురును గద్దించుట

11 అయితే కేఫా అంతియొకయకు వచ్చినప్పుడు అతడు అపరాధిగా తీర్చబడెను గనుక నేను ముఖాముఖిగా అతనిని ఎదిరించితిని. 12 ఏలయనగా యాకోబు నొద్ద నుండి కొందరు రాకమునుపు అతడు అన్యజనులతో భోజనము చేయుచుండెను గాని, వారు రాగానే సున్నతి పొందిన వారికి భయపడి వెనుకతీసి వేరైపోయెను. 13 తక్కిన యూదులును అతనితో కలిసి మాయవేషము వేసికొనిరి గనుక బర్నబా కూడ వారి వేషధారణము చేత మోసపోయెను. 14 వారు సువార్త సత్యము చొప్పున క్రమముగా నడుచుకొనకపోవుట నేను చూచినప్పుడు అందరి యెదుట కేఫాతో నేను చెప్పినదేమనగా – నీవు యూదుడవై యుండియు యూదులవలె కాక అన్యజనులవలెనే ప్రవర్తించుచుండగా, అన్యజనులు యూదులవలె ప్రవర్తింపవలెనని ఎందుకు బలవంతము చేయుచున్నావు ?

## ధర్మశాస్త్రము యొక్క నిష్ప్రయోజకత్వము

15 మనము జన్మమువలన యూదులమే గాని అన్యజనులలో చేరిన పాపులము కాము. 16 మనుష్యుడు యేసుక్రీస్తునందలి విశ్వాసము వలననే గాని ధర్మశాస్త్ర సంబంధమైన క్రియల మూలమున నీతిమంతుడుగా తీర్చబడడని ఎరిగి మనమును ధర్మశాస్త్ర సంబంధమైన క్రియల మూలమున గాక క్రీస్తునందలి

విశ్వాసము వలననే నీతిమంతులమని తీర్చబడుటకై యేసుక్రీస్తు నందు విశ్వాసముంచి యున్నాము ధర్మశాస్త్ర
సంబంధక్రియల మూలమున ఏ శరీరియు నీతిమంతుడని తీర్చబడడు గదా? 17 కాగా మనము క్రీస్తునందు
నీతిమంతులమని తీర్చబడుటకు వెదకుచుండగా మనము పాపులముగా కనబడినయెడల, ఆ పక్షమందు క్రీస్తు
పాపమునకు పరిచారకుడాయెనా? అట్లనరాదు. 18 నేను పడగొట్టిన వాటిని మరల కట్టినయెడల నన్ను నేనే
అపరాధినిగా కనుపరచు కొందును గదా? 19 నేనైతే దేవుని విషయమై జీవించు నిమిత్తము ధర్మశాస్త్రమువలన
ధర్మశాస్త్రము విషయమై చచ్చినవాడనైతిని. 20 నేను క్రీస్తుతో కూడ సిలువ వేయబడియున్నాను ఇకను
జీవించువాడను నేను కాను, క్రీస్తే నాయందు జీవించుచున్నాడు. నేనిప్పుడు శరీరమందు జీవించుచున్న
జీవితము నన్ను ప్రేమించి, నా కొరకు తన్నుతాను అప్పగించుకొనిన దేవుని కుమారుని యందలి విశ్వాసము
వలన జీవించుచున్నాను. 21 నేను దేవుని కృపను నిరర్థకము చేయను నీతి ధర్మశాస్త్రము వలననైతే ఆ
పక్షమందు క్రీస్తు చనిపోయినది నిష్ప్రయోజనమే.